క్లుప్తంగా

వైభవంగా ధాన్యలక్ష్మీ నారాయణుల కల్యాణం



పాత గుంటూరు: అరండల్ పేట అష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయ 29వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ధాన్యలక్ష్మీ నారాయణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్ నిర్వహణలో అభిషేకాలు, కుంకుమ పూజలు, హారతి, మంత్రపుష్పం, లలిత సహస్రనామ పారాయణం చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

అభివృద్ధే ధ్యేయం

నెహ్రూ నగర్: ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి నియోజకవర్గం ఒక అభివృద్ధి కేంద్రంగా మార్చడమే జై భారత్ నేషనల్ పార్టీ ముఖ్య ఉద్దేశమని ఆ పార్టీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మంచాల సుశీల్ రాజా పేర్కొన్నారు. మంగళవారం అమరావతి రోడ్డులోని జై భారత్ నేషనల్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంటులో ప్రత్యేక హోదా విభజన హామీలపై తన గళం వినిపిస్తానని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి చెరుకుపల్లి జోషి రంగనాథ్ మాట్లాడుతూ నియోజవర్గంలో విస్తృతంగా పర్యటించి పార్టీని బలోపేతం చేస్తామన్నారు.

సమాజాభివృద్ధిలో సోషల్ వర్కర్ల పాత్ర కీలకం

ఏఎన్‌యూ: సమాజాభివృద్ధిలో సోషల్ వర్కర్ల పాత్ర ఎంతో కీలకమని యూనివర్సిటీ సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య వి.వెంకటేశ్వర్లు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సోషియాలజీ విభాగంలో మంగళవారం 'వరల్డ్ సోషల్ వర్క్ డే ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సోషల్ వర్కర్ల సామాజిక, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. సోషియాలజీ విభాగ అధ్యాపకుడు ఆచార్య త్రిమూర్తిరావు, డాక్టర్ రాజకుమార్ పాల్గొన్నారు. అధ్యాపకులను పరిశోధకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ పరిశోధకులు ఆవులయ్య, స్వరూప్ పాల్, బ్రహ్మం ఉన్నారు.

ప్రజలకు మేలు చేకూర్చిన సీఎం జగన్

వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి నూరి ఫాతిమా

పట్నంబజారు: సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్ర ప్రజలకు అన్ని విధాలుగా మేలు చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా అన్నారు. నియోజకవర్గంలోని 3వ డివిజన్‌లో ఆమె మంగళవారం పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ పేద వారికి ఆరోగ్య శ్రీ ద్వారా ప్రతి గడప లోనూ ఆరోగ్య భరోసాని సీఎం వైఎస్ జగన్ కల్పించారన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకోవాలనే సమున్నత లక్ష్యంతో ముందుకు సాగుతున్నారన్నారు. నిత్యం జగనన్నపై దుష్ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేనలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవటం ద్వారానే అన్నివర్గాలకు మేలు జరుగుతుందని స్పష్టం చేశారు.



స్థానికులతో మాట్లాడుతున్న నూరి ఫాతిమా

స్థిరమైన లక్ష్యంతో జీవితంలో ప్రగతి

గుంటూరు ఎడ్యుకేషన్: కెరీర్‌పై చక్కటి అవగాహన, స్థిరమైన లక్ష్యంతో జీవితంలో ప్రగతి సాధించగలమని హైదరాబాద్‌కు చెందిన బయాన్ థెరపిటిక్స్ లిమిటెడ్ వ్యవస్థాపక డైరెక్టర్ ఎం.గిరిధర్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఎంబీఏ, హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు స్పర్థ–2024 పేరుతో మేనేజ్‌మెంట్ ఫెస్ట్ మంగళవారం ప్రారంభించారు. ముఖ్య అతిథి గిరిధర్ మాట్లాడుతూ భవిష్యత్తు ఎప్పుడూ పూలబాట కాదని, స్థిరమైన లక్ష్యం, కృషి, పట్టుదలతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరగనున్న పోటీల్లో భాగంగా బిజినెస్ క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్, మార్కెట్ మేకర్స్, యంగ్ మేనేజర్ ఈవెంట్లు ఉంటాయని తెలిపారు. కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ లక్ష్మీనారాయణ, బయాన్ సంస్థ ప్రతినిధి చక్రపాణి, కార్యక్రమ కన్వీనర్ వి. చక్రవర్తి, కో–కన్వీనర్ డి. కల్యాణి, ఐక్యూ ఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. గోపి శ్రీనివాస్, సహాయాచార్యులు పాల్గొన్నారు.



గిరిధర్‌ను సత్కరిస్తున్న ఎస్వీ రమణ, చక్రవర్తి, కళ్యాణి

అంగన్‌వాడీ కేంద్రాలకూ ఒంటిపూట ప్రకటించరూ..

మహిళా శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్, రాష్ట్ర జాయింట్ డైరెక్టర్‌కు వినతిపత్రం

ప్రత్తిపాడు: ఎండలు మండుతున్న నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా ఒంటిపూట బడులను అమలు చేయాలని కోరుతూ ఫోరమ్ ఫర్ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్– మినీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు టి. జ్యోతిరాణి కోరారు. ఈ మేరకు మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ వెట్రి సెల్వి, జాయింట్ డైరెక్టర్ మనోరంజనిలను కలిసి వినతి పత్రాలను అందజేశారు. ఎండలు విపరీతంగా కాస్తుండటంతో కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండాలంటే చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని, అందుచేత హాఫ్ డేస్ ప్రకటించాలని కోరారు. అదేవిధంగా మే నెల మొత్తం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు, మినీ సెంటరు వర్కర్లుకు వేసవి సెలవులు ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు, జీతాలు విడుదల చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందజేస్తున్న టి.జ్యోతిరాణి

కొత్తపేట పోలీసుల కవాతు

పట్నంబజారు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం కొత్తపేట పోలీసుస్టేషన్ అధికారులు, సిబ్బంది, ప్రత్యేక బలగాలు స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కవాతు నిర్వహించాయి. ఎస్‌హెచ్‌వో షేక్ అన్వర్‌బాషా, ఎస్‌ఐ తరంగిణి, సీఐఎస్‌ఎఫ్ బలగాలతో కొత్తపేట, మాయాబజారు, ఆర్టీసీ బస్టాండ్, ఓల్డ్ క్లబ్‌రోడ్డు, 60 అడుగుల రోడ్డు, రామిరెడ్డితోట, నెహ్రూనగర్ ప్రాంతాల్లో కవాతు జరిగింది. ప్రత్యేక బలగాలతో శాంతిభద్రతల పరిరక్షించే విధంగా అన్ని ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గంగానమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

గుండవరం(చేబ్రోలు): చేబ్రోలు మండలం గుండవరం గ్రామంలో గంగానమ్మతల్లి అమ్మవారికి భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగానమ్మతల్లి వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తులు రెండు రోజుల పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక రథంపై అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. విశేష కార్యక్రమాలు, అభిషేకాలు జరిగాయి. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

నేడు ప్రతిష్టా మహోత్సవం

మంచాల(చేబ్రోలు): చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో హనుమత్ లక్ష్మణ సమేత సీతారామచంద్ర స్వామి వారి మందిర విగ్రహ ప్రతిష్టా మహోత్సవం బుధవారం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. దీనిలో భాగంగా ఐదురోజుల పాటు వివిధ కార్యక్రమాలను పండితులు వైభవంగా జరుపుతున్నారు. బుధవారం జలాధివాసం, వివిధ హోమాలు నిర్వహించారు. 20వ తేదీ గురువారం ఉదయం పది గంటలకు హనుమత్ లక్ష్మణ సమేత సీతారామచంద్రస్వామి వారల ప్రతిష్టా మహోత్సవం జరగనున్నది. శాంతి కల్యాణం, అన్నదానం జరుగుతుందని తెలిపారు.

ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు

ఆర్వో, నగర కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాజకీయ పార్టీల నాయకుల నుంచి అందిన ఫిర్యాదులను, ఆర్జీలను వెంటనే పరిష్కారించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఆర్‌ఓ కీర్తి చేకూరి ఆదేశించారు. మంగళవారం తన చాంబరులో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో పశ్చిమ నియోజకవర్గ ఆర్‌ఓ, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మీతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ఓటరు జాబితాపై ఓటర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అందిన అర్జీలను, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కారించాలన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ నెల 11 నుంచి 18వ తేదీ రెండు నియోజకవర్గాల్లో ఫారం 6, 7, 8లు, షిఫ్టింగ్ దరఖాస్తులు 3,529 అందాయని తెలిపారు. వాటిని 2 రోజుల్లో పరిష్కారించాలని ఆదేశించినట్లు చెప్పారు. ఏఈఆర్‌ఓలు వెంకటలక్ష్మి, సునీల్, సూపరింటెండెంట్లు ప్రసాద్, పద్మ, సెక్టోరల్ అధికారి శ్రీధర్, వైఎస్సార్ సీపీ నుంచి డి.జాని బాబు, టీడీపీ నుంచి ఓంకార్, బీఎస్పీ నుంచి సీహెచ్.వాసు, ఆమ్ ఆద్మీ నుంచి సేవకుమార్, కాంగ్రెస్ నుంచి జాని బాష, డిప్యూటీ తహసిల్దారు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే..కేసులు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తొలగించిన రాజకీయ పార్టీల పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు సరైన అనుమతులు లేకుండా తిరిగి ఏర్పాటు చేస్తే ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలీసు కేసులు నమోదు చేయాలని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అధికారులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం ఆదేశించారు. నగరంపాలెం, కన్నావారితోట, రైల్ పేట, నాజ్ సెంటరు, కొత్తపేట, వసంతరాయపురం, శారదా కాలని, సంజీవయ్య నగర్, నెహ్రూనగర్‌లోని పలు ప్రాంతాల్లో కోడ్ అమలుని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. కొన్ని ప్రాంతాల్లో తొలగించిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు సరైన అనుమతి లేకుండా కొందరు తిరిగి ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీనిపై క్షేత్ర స్థాయి ఎంసీసీ అధికారులు నివేదిక ఇస్తున్నారని చెప్పారు. నగరంలో ఎక్కడైనా ఎంసీసీ ఉల్లంఘనలను ప్రజలు గుర్తిస్తే నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కంప్లైంట్ సెల్‌కు లేదా 98499 08391 కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపితే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పర్యటనలో ఏఆర్‌ఓ సునీల్, భీమరాజు, ఎంసీసీ టీం అధికారి అనుపమ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

బ్రాహ్మణ హితుడు సీఎం వైఎస్ జగన్

ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు: బ్రాహ్మణ హితుడు రాష్ట్ర వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ప్రభుత్వ విప్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. ఈ నెల 31న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం ఏర్పాట్లపై ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ పి.కామేశ్వరరావు, ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురపు శ్రీకాంత్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరరామశర్మ తదితరులతో చంద్రమౌళి నగర్‌లోని తన నివాసంలో ఆయన చర్చించారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.300 కోట్లు కేటాయించి బోలపేతం చేసినట్లు చెప్పారు. ధూపదీప నైవేద్యాలకు ప్రత్యేకంగా రూ.234 కోట్లు కేటాయించి ఆలయాలకు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. బ్రాహ్మణ ఆత్మీయ సమావేశానికి అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ పి.కామేశ్వరరావును అప్పిరెడ్డి ఘనంగా సత్కరించారు. గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), ఆడిటర్ గణపతి పాల్గొన్నారు.



కామేశ్వరరావును సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ అప్పిరెడ్డి

ర్యాలీలు, ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

ప్రత్తిపాడు: రాజకీయ పార్టీలు నిర్వహించే ప్రచారాలకు, ర్యాలీలకు ఖచ్చితంగా అనుమతులు తీసుకోవాల్సిందేనని ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్ స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రాజకీయపార్టీల నాయకులతో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఆర్వో మాట్లాడుతూ వాల్ రైటింగ్‌లకు ఎలాంటి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదన్నారు. ప్రైవేట్ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే ఫ్లాగ్‌లు, పోస్టర్లకు సంబంధించి కచ్చితంగా సంబంధిత ఇంటి లేదా స్థల యజమాని డిక్లరేషన్ ఇవ్వవలసి ఉంటుందన్నారు.